## పోలీసులపై జనసైనికుల దాడి

**యూసుఫ్‌గూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** నిబంధనలకు విరుద్ధంగా టపాసులు ఎందుకు కాలుస్తున్నారని ప్రశ్నించిన పోలీసులపై దురుసుగా వ్యవహరించడమే కాకుండా దాడి చేసిన జనసేనకు చెందిన ఇద్దరిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం సాయంత్రం సిద్దార్థ్‌నగర్‌లో పెట్రోలింగ్ చేస్తున్న పి.దామోదర్, జి.లాస్‌సింగ్ జనసేన కార్యకర్తలు టపాసులు పేల్చుతుండడాన్ని గమనించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కాల్చకూడదని చెప్పారు. ఆగ్రహం చెందిన వారు దురుసుగా సమాధానం చెప్పారు. పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరగా దాడి చేశారు. దీంతో లాల్‌సింగ్ కుడిచేతికి గాయమైంది. దాడి చేసిన వారిని భానుప్రకాష్, పి.కిశోర్‌లుగా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

## మద్యం తాగొచ్చి దాడి

**యూసఫ్‌గూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** మద్యం తాగొచ్చి అల్లరి చేయటమే కాకుండా తన తమ్ముడిపై దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని ఓ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎల్లారెడ్డిగూడలో నివసించే మీనాక్షి సీసీటీవీ కెమెరా మేనేజర్‌గా పనిచేస్తుంది. ఈనెల 3వ తేదీ రాత్రి 9 గంటలకు ఆమె తమ్ముడు గణేష్, బంధువు సంతోష్ మద్యం తాగి ఇంటికి వచ్చి గొడవచేశారు. ఈ విషయాన్ని మీనాక్షి ఇంటి పక్కన ఉంటున్న పవన్‌కు ఫోన్ చేసి తెలిపింది. అతడు కూడా మద్యం తాగొచ్చి అర్ధరాత్రి తలుపుకొట్టాడు. మీనాక్షి తలుపు తీయగా అసభ్యంగా మాట్లాడాడు. సంతోష్, పవన్ ఇద్దరూ కలిసి గణేష్‌పై దాడి చేయగా తలకు గాయమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### స్టాక్‌మార్కెట్ ఐపీవో పేరుతో మోసం..

## లోన్ ఇప్పించి.. రూ.34.90 లక్షలు కొట్టేశారు

- వాట్సా‌ప్‌లో మెసేజ్.. '657 ఐసెకన్' పేరుతో గ్రూప్
- ప్రత్యేక యాప్‌తో బురిడీ.. నిలువునా ముంచిన కేటుగాళ్లు

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** స్టాక్ మార్కెట్‌లో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్(ఐపీవో)లో పెట్టుబడి పేరుతో.. సైబర్ కేటుగాళ్లు రుణం ఇప్పించి మరీ ఓ బాధితుడి నుంచి రూ.34.90 లక్షలు కొట్టేశారు. నగరానికి చెందిన సదరు బాధితుడి ఫిర్యాదుతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు వాట్సాప్‌లో స్టాక్‌మార్కెట్ పేరుతో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. '657 ఐసెకన్' అనే వాట్సాప్ గ్రూపులో అతడు యాడ్ అయ్యాడు. ఆ గ్రూప్‌లో 140 మంది సభ్యులున్నారు. వారంతా రోజువారీ వ్యూహాలు.. లాభాల గురించి చర్చించుకుంటున్నారు. గ్రూప్ అడ్మిన్ నుంచి 'ఇంకా యాప్ డౌన్‌లోడ్ చేసుకోనివాళ్లు కింది లింక్ ద్వారా వివరాలను పంపొచ్చు' అనే సందేశాన్ని పోస్ట్ చేశాడు. దానికి బాధితుడు స్పందించడంతో.. వ్యక్తిగత వివరాలను సేకరించి, అతడితో ఫేక్ బ్రోకరేజ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అందులో ట్రేడింగ్ చేసే సదుపాయం కల్పించారు. శివం కెమెకిల్స్ అనే కంపెనీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్స్(ఐపీవో)లో పెట్టుబడులు పెట్టాలంటూ యాప్ ప్రతినిధుల పేరుతో బాధితుడికి ఫోన్లు వచ్చాయి. బాధితుడు దానికి ఒప్పుకోకపోవడంతో.. సెబీ నుంచి భారీ పెనాల్టీ పడుతుందని హెచ్చరించారు. "నా దగ్గర డబ్బుల్లేవు" అని చెబితే.. బజాజ్ క్యాపిటల్ నుంచి భారీగా లోన్ ఇప్పించి, ఇన్వెస్ట్ చేయించారు. లాభాలు కూడా భారీగా వచ్చినట్లు యాప్‌లో కనిపించడంతో.. బాధితుడు విత్‌డ్రా చేసుకునేందుకు యత్నించగా.. ఆ ఆప్షన్ కనిపించలేదు. యాప్ ప్రతినిధులకు కాల్ చేసినా.. స్పందన లేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

## ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు రైల్లో గంజాయి రవాణా

- స్మగ్లర్ అరెస్టు.. 22 కేజీల గంజాయి స్వాధీనం



అరెస్టయిన స్మగ్లర్, స్వాధీనం చేసుకున్న గంజాయి

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** బ్యాగ్‌లలో గంజాయి నింపుకొని ఒడిశా నుంచి రైల్లో హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల కళ్లుగప్పి సరుకును సరఫరా చేయాలని చూసిన ఘరానా స్మగ్లర్‌ను హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్ న్యూ) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.5.55 లక్షల విలువైన 22 కేజీల గంజాయి బ్యాగ్‌లను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్స్ మాదకద్రవ్యాలను గుట్టుగా నగరానికి తెస్తున్నారు. ఇదే క్రమంలో ఒడిశా గజపతి జిల్లాకు చెందిన కురేష్ షైక్ అలియాస్ కురేష్‌కు నగరంలోని గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఉంది. అతడి ఆదేశాల మేరకు కురేష్ 22 కేజీల గంజాయిని బ్యాగ్‌లలో నింపుకొని రైల్లో సికింద్రాబాద్ చేరుకున్నాడు. అక్కడి నుంచి బయటకు వచ్చి రిసీవర్ కోసం ఎదురుచూస్తున్నాడు. అతడికి సరుకు అందజేసి, డబ్బు తీసుకొని వెంటనే వెళ్లిపోవడానికి వేచి చూస్తున్నాడు. ఇంతలోనే విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్ న్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డానియేల్ బృందాలు రంగంలోకి దిగాయి. మార్కెట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి కురేష్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ కౌన్సిలర్ దాడి

- దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు

**దుండిగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ కౌన్సిలర్ అనుచరులతో కలిసి దాడి చేశారు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరుపార్టీల నాయకులపై లాఠీలు ఝుళిపించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బీజేపీ నాయకుడు కేసారం శ్రీనివాస్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ విజయం సాధించడంతో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో శంభీపూర్ గ్రామంలోని హన్‌మాన్ దేవాలయం వద్ద బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారు. ఆ సమయంలో అక్కడికి నాలుగు కార్లలో వచ్చిన కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, ఆయన అనుచరులు రమేష్, భిక్షపతి, జీతయ్య, కె.శ్రీశైలం, ఎం.శ్రీశైలం, శ్రీచంద్రశేఖర్, ఎస్.రమేష్, జి.మల్లేష్, కె.వినయ్, కె.అభి, కె.బబ్లూ, ఎ.వికాస్, ఎస్ దీపక్, ప్రభాకర్, మరికొంతమంది వచ్చి ఇక్కడ ఎందుకు సంబరాలు చేసుకుటున్నారని బీజేపీ నాయకులను బెదిరించారు. వారికి కార్లను అడ్డుపెట్టి, ట్రాన్స్ ఫార్మర్ బంజేసి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌పై దాడి చేసి రెండు సెల్ ఫోన్‌లు లాక్కుని పగలగొట్టారు. కారు (నం. టీఎస్ 08 టీఆర్‌కెఎం1502) అద్దాన్ని పగలు కొట్టి, హ్యాండిల్ విరగొట్టి, బీజేపీ నాయకులు 8 మందిని దుర్భాషలాడి, కర్రలు, రాడ్లతో వారిపై దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు కేసారం శ్రీనివాస్ దుండిగల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.




రోజా మహిళా పొదుపు సంఘం ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న వాణీప్రసాద్

## సౌరశక్తిని ప్రోత్సహిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సౌరశక్తి(సోలార్ పవర్)ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా వృక్ష సంపదను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, భూ వినియోగ మార్పులు, నీటి వనరుల పర్యవేక్షణకు రిమోట్ సెన్సింగ్‌తో పాటు జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సాంకేతికతను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. సభ్య కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన వ్యర్థాలను సరైన రీతిలో నిర్వహించి కాలుష్య నివారణకు సహకరించాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. చెట్ల పెంపకంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా వివిధ పద్ధతుల ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న పరిశ్రమలు, ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థల, పొదుపు సంఘాల ప్రతినిధులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్న కుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎందుకిలా జరిగింది!

- ఆదరించిన స్థానంలోనే వ్యతిరేకతా..?
- ఖైరతాబాద్‌పై దృష్టి పెట్టి ఉంటే బాగుండేది..
- కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం..

**బంజారాహిల్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ నియోజకవర్గం దానం నాగేందర్‌కు కంచుకోట. ఆసిఫ్‌నగర్ నుంచి ఖైరతాబాద్‌కు మారాక జరిగిన నాలుగు ఎన్నికల్లో మూడుసార్లు గెలిచారు. ఏ పార్టీలో ఉన్నా ఆయనకు ఆదరణ లభించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన దానం నాగేందర్‌కు 22,010 మెజారిటీ లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి గట్టి పోటీ ఇచ్చినా దానం వ్యక్తిగత ఇమేజ్ విజయానికి దోహదపడింది. ఆరు నెలలు గడవక ముందే దానం నాగేందర్‌ను నియోజకవర్గం ఓటర్లు వ్యతిరేకించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మూడోస్థానంలో ఉన్న బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో మొదటి స్థానం దక్కించుకుంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి 16,540 ఓట్ల మెజారిటీ సాధించారు. సొంత నియోజకవర్గంలో వ్యతిరేకత ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు ఊహించలేదు. కనీసం 30 వేల మెజారిటీ వస్తుందని లెక్కలు వేసుకున్నారు. వారి అంచనాలు తారుమారయ్యాయి. పొరపాటు ఎక్కడ జరిగిందనే దానిపై కాంగ్రెస్ శ్రేణులు దృష్టి సారించాయి. సొంత నియోజకవర్గంలో దానం కొంత కష్టపడి ఉంటే ఫలితం మరోలా ఉండేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### పార్టీ మారడంతో..

బీఆర్ఎస్ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన దానం నాగేందర్ ఆ తరువాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని ఆదేశించింది. మొదట వెనకడుగు వేసిన దానం అధిష్ఠానం అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో బరిలో దిగారు. గతంలో గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉండటంతో వారం రోజుల్లోనే అన్ని ఏర్పాట్లు చేసుకొని రంగంలోకి దిగారు. బీఆర్ఎస్‌లో ఉండగా ఆయనతో పనిచేసిన మేయర్, ఇద్దరు కార్పొరేటర్లు, ప్రధాన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఖైరతాబాద్‌లోని కాంగ్రెస్ శ్రేణుల బలం కలిసి వస్తుందనుకున్నారు. కానీ అంచనాలు తారుమారు చేస్తూ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపించారు. దానం నాగేందర్ పార్టీ మారడాన్ని ఓటర్లు జీర్ణించుకోలేకపోయారనే వాదన వినిపిస్తోంది. నియోజకవర్గంలో పార్టీలకతీతంగా దానం కంటూ కొంత ఓటు బ్యాంకు ఉంది. వీరంతా పార్టీ మారడాన్ని వ్యతిరేకించినట్టు నాయకులు చెబుతున్నారు.



### కారణాలు అనేకం..

అవసరాల్లో ఉన్న వారికి సహాయం చేయడంలో దానం నాగేందర్ ముందుంటారు. ఇలాంటి నాయకుడు నియోజకవర్గం వదిలి ఢిల్లీకి పోతే మా కష్టాలు ఎవరికి చెప్పుకోవాలనే భావనతో కొంతమంది శ్రేణులు మనసు పెట్టి పనిచేయలేదనే వాదన వినిపిస్తోంది. ఇది మెజారిటీ రాకపోవడానికి కారణం కాకపోయినా కొంతమేర ఓటర్లపై ప్రభావం చూపిందన్నది వాస్తవమని పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఏ ఎన్నికల్లోనైనా ఫిలింనగర్‌లోని 18 బస్తీల వాసులు దానం వెంట ఉన్నారనడానికి గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లే నిదర్శనం. కానీ లోక్‌సభ ఎన్నికల్లో 16 బస్తీల్లో ఓట్ల సాధనలో కాంగ్రెస్ వెనుకపడింది. ఇక్కడ బీజేపీకి దాదాపు ఐదు వేల మెజారిటీ లభించింది. దానంకు ప్రతిసారి ఓట్లు వేసే కొన్ని వర్గాలు ఈ ఎన్నికల్లో ఏపీకి తరలివెళ్లడం వల్ల సుమారు రెండు వేల ఓట్లు పడలేదన్న వాదన కూడా వినిపిస్తోంది. ఇక కొన్ని ప్రాంతాల్లో ఎప్పుడూ లేని విధంగా కాలనీవాసులు బయటకు వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. గతంలో గడపదాటని వారు సైతం ఈసారి క్యూలో నిలబడి మరీ ఓటేశారు. ఈ ఓట్లన్నీ కూడా బీజేపీకి పడ్డాయని తాజా లెక్కలు తెలియజేస్తున్నాయి. ఎంఐఎం మద్దతుతో మైనారిటీల ఓటు బ్యాంకు పూర్తిగా కాంగ్రెస్‌కే దక్కింది. కానీ మిగతా వర్గాల ఓట్లు మూడు పార్టీల మధ్య చీలింది. ఇది కూడా ఓ కారణమై ఉంటుందని అంచనావేస్తున్నారు. వీటన్నింటిని పక్కన పెడితే దానం నాగేందర్ ఖైరతాబాద్‌పై మరింత దృష్టి సారించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని వర్గాల వారిని నేరుగా కలిసి ఉంటే మెజారిటీలో మార్పు ఉండేదని భావిస్తున్నారు. ఏది ఏమైతేనేం దానంకు ఖైరతాబాద్‌లో మెజారిటీ తగ్గడానికి కారణాలు కౌంటింగ్ పూర్తయ్యాక గానీ తెలియలేదు.

**రౌండ్ల వారీగా ఓట్ల వివరాలు**

| | బీజేపీ | కాంగ్రెస్ | బీఆర్ఎస్ |
|---|---|---|---|
| 1 | 4,765 | 3,553 | 593 |
| 2 | 5,162 | 3,079 | 808 |
| 3 | 6,092 | 2,274 | 593 |
| 4 | 4,545 | 2,745 | 1,075 |
| 5 | 4,985 | 3,575 | 948 |
| 6 | 4,886 | 2,847 | 779 |
| 7 | 4,984 | 2,303 | 702 |
| 8 | 3,355 | 5,283 | 865 |
| 9 | 2,470 | 4,340 | 983 |
| 10 | 3,745 | 2,569 | 1,418 |
| 11 | 4,579 | 2,325 | 1,053 |
| 12 | 4,763 | 2,076 | 700 |
| 13 | 3,594 | 2,515 | 1,894 |
| 14 | 3,356 | 2,675 | 1,431 |
| 15 | 3,322 | 4,286 | 935 |
| 16 | 3,320 | 4,280 | 660 |
| 17 | 4,595 | 2,728 | 1,042 |
| 18 | 846 | 3,671 | 183 |



ఇందిరానగర్ ప్రధాన రహదారిలో నిలిచిన నీరు



ఎస్ఆర్‌నగర్ ప్రధానదారిలో వర్షపు నీరు

## కుండపోత వర్షం.. రోడ్లన్నీ జలమయం

- డ్రైనేజీలు పొంగడంతో రోడ్ల మీదకు మురుగు నీరు



బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో నీరు నిలవడంతో వాహనాలను మరో మార్గంలో తరలిస్తున్న యువకులు

**బంజారాహిల్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** కుండపోత వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. కార్యాలయాలు, కళాశాలలు వదిలే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. బుధవారం కురిసిన వర్షానికి కృష్ణానగర్, ఇందిరానగర్, సంజీవరెడ్డినగర్, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో వరద నీరు నిలిచింది. వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. పూడుకుపోయిన వరద నీటి కాలువలను స్థానికులు శుభ్రం చేశారు. జూబ్లీహిల్స్ నుంచి భారీగా వరద నీరు రావడంతో కృష్ణానగర్ వీధులు మునిగిపోయాయి. నడుం లోతు నీరు ప్రవహించడంతో స్థానికులు బయటకు రావడానికి భయపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

## కాలుష్యం నుంచి భూమిని కాపాడుకుందాం..

**పంజాగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** కాలుష్యం భూతాపం నుంచి భూమండలాన్ని కాపాడుకుందామని సినీ గేయ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు అన్నారు. జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణకాంత్ పార్క్ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ వారసత్వంలోనే పర్యావరణ పరిరక్షణ దాగి ఉందని, పూర్వీకులు సహజ సంపదను భావితరాలకు అందజేశారని, వాటిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. పెట్టుబడి పేరుతో, లాభాపేక్షతో ప్రకృతికి విరుద్ధమైన కార్యక్రమాలు చేస్తూ మానవజాతి మనుగడకే ప్రమాదాన్ని కొనితెస్తున్నారని అన్నారు. ఇప్పటికే అనేక జీవజాతులు అంతరించాయని, అధిక ఉష్ణోగ్రతకు కారణమైన పర్యావరణ కాలుష్యాన్ని నివారించలేని పక్షంలో భూతాపంతో భూమండలంతో పాటు మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడవచ్చునని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఫార్మా ఇండస్ట్రీ వ్యవస్థాపకులు వి.రామకృష్ణారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర రావు, కృష్ణకాంత్ పార్క్ వాకర్ అసోసియేషన్ సభ్యులు రాజేష్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రవీంద్రబాబు, కె.సూర్యనారాయణ, సాయి, పోసాని సుబ్బారావు, పి.పాపారావు, సీహెచ్.మురళి, బి.సంతోష్ కుమార్, ఎస్.జితిన్ ప్రసాద్, ఆర్.అశోక్, ఎం.బ్రహ్మం పాల్గొన్నారు.



వెంగళరావునగర్ ఏ-బ్లాక్ పార్క్‌లో మొక్కలు నాటుతున్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ రవిశేఖర్ రెడ్డి, తదితరులు

### వెంగళరావునగర్‌లో..

వెంగళరావునగర్ ఏ-బ్లాక్ పార్కులో బుధవారం కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం స్వచ్ఛంద సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీ.వీ.రవిశేఖర్ రెడ్డి స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలని ఆయన సూచించారు. స్థానికులు వినోద్ కుమార్, సాయి, నాగరాజు, మల్లేష్ గౌడ్, సన్నీగౌడ్ పాల్గొన్నారు.

## పీవీ మార్గంలో మానవహారం



పీవీ మార్గంలోని నిర్వహించిన మానవహారం

**ఖైరతాబాద్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం సంస్థల ఆధ్వర్యంలో పీవీ.నర్సింహారావు మార్గంలోని లవ్ హైదరాబాద్ వద్ద బుధవారం మానవహారం నిర్వహించారు. ప్రకృతిని కాపాడుకోవాలని, హుస్సేన్‌సాగర్, హైదరాబాద్‌ను రక్షించుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కే.వీరయ్య, నగర నాయకులు ఎం.శ్రీనివాసరావు మల్లం రమేష్, పి. శ్రీనివాస్, మోహన్, సైదులు, సుకుమార్, రాజమౌళి, అస్మిత, సంగీత, మాధవి, శ్రీవల్లి, గోపాల్, నర్సింగ్ రావు, రమేష్, రఘు, మల్లయ్య, బాబు పాల్గొన్నారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంజీవయ్య పార్కులో అర్బన్ ఫారెస్టు డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ శెట్టితో కలిసి హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి మొక్కలు నాటారు. - (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

## ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

**పంజాగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కల్పదర్శి చైతన్య మాట్లాడుతూ గత సంవత్సరం ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో రిజర్వేషన్‌కు సంబంధించిన జీవోను ఎక్కడా జతపరచలేదని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏ జీవో ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తుందో స్పష్టత ఇవ్వాలని, తర్వాతే పదోన్నతులు, బదిలీలు చేట్టాలని అన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వడ్డేమాన్ బాలపీర్, అసోసియేట్ ప్రెసిడెంట్ చిలుక భాస్కర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కావలి రమేష్ ఉన్నారు.



రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతిపత్రం ఇస్తున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు

### ఔరంగాబాద్‌లో ఓటమితో

## లోక్‌సభలో మజ్లిస్‌కు మళ్లీ ఒకే ఒక్కడు..!

**హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** గత లోకసభలో ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(మజ్లిస్) పార్టీకి ఇద్దరు సభ్యులుండగా ఈసారి ఒకే ఒక్క సభ్యుడితో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మజ్లిస్ మొట్టమొదటిసారి 1984 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి లోకసభలో అడుగుపెట్టింది. అప్పటి నుంచి వరుసగా ఆరుసార్లు సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ, అనంతరం ఆయన కుమారుడు అసదుద్దీన్ ఒవైసీ 2004 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు లోకసభ సభ్యుడిగా వరుసగా ఎన్నికయ్యారు. ఈ సారి అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజారిటీతో లోకసభకు ఎన్నికయ్యారు. కాగా, 2019లో మహారాష్ట్రలో జరిగిన రాజకీయ పరిణామాల్లో ఔరంగాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఇంతియాజ్ జలీల్ విజయం సాధించి లోకసభలో అడుగుపెట్టారు. దీంతో గత లోకసభలో మజ్లిస్‌కు ఇద్దరు సభ్యుల బలం ఉండేది. ఈ సారి ఔరంగాబాద్ నుంచి పోటీ చేసిన ఇంతియాజ్‌జలీల్ శివసేన అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే, బీహార్‌లోని కిషన్‌గంజ్ సీటును కైవసం చేసుకునేందుకు మజ్లిస్ తీవ్రంగా ప్రయత్నించింది. పార్టీ ఆ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సైతం రెండు దఫాలుగా బీహార్‌లో పర్యటించి కిషన్‌గంజ్‌లో అక్తరుల్ ఇమాన్‌ను గెలిపించేందుకు విస్తృతంగా ప్రచారం చేసినా విజయం సాధించలేకపోయారు. మూడోస్థానానికి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గతంలో లాగే మళ్లీ లోకసభలో మజ్లిస్ పార్టీ ప్రతినిధిగా అసదుద్దీన్ ఒవైసీ ఒక్కరే ప్రాతినిధ్యం వహించనున్నారు.

## భూ ఆక్రమణకు పాల్పడ్డ పది మందికి రిమాండ్



బెదిరింపులకు పాల్పడిన ముఠా సభ్యులు

**సంగారెడ్డి టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** విలువైన భూమిని కాజేసేందుకు యత్నించడంతో పాటు భూ యజమాని, కూలీలను భయభ్రాంతులకు గురి చేసిన ముఠాను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. బుధవారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బంజారాహిల్స్‌కు చెందిన అత్రియా ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మంతెన రామకృష్ణ శ్రీనివాస్ వర్మ (ఎంఆర్ఎస్ వర్మ), అదే ప్రాంతానికి చెందిన పెండ్యాల హరినాథ్‌బాబుకు మునిపల్లి మండలంలో 100 ఎకరాల భూమి ఇప్పిస్తానని, దానిని తానే డెవలప్ చేస్తానని ఎంఓయూ చేసుకుని రూ. 30 కోట్లు తీసుకున్నాడు. తరువాత హరినాథ్ బాబుకు 70 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. ఇందులో పదెకరాలు డబుల్ రిజిస్ట్రేషన్. దీంతో తనకు పదెకరాల భూమి ఇవ్వాలని హరినాథ్‌బాబు వర్మను అడిగాడు. దీంతో ఆగ్రహం చెందిన వర్మ తన వద్ద పనిచేస్తున్న గణపతి రాజు (శ్రవణ్), గట్టుముక్కల భారత్ వర్మ, పి.అశోక్ రెడ్డి, పాషాలకు విషయం చెప్పాడు. వారు అఖిల్ అనే వ్యక్తిని సంప్రదించారు. మే 26న మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామ పరిధిలో పెండ్యాల హరినాథ్‌కు చెందిన సర్వే నెంబర్ 198, 251లోని భూమిలోకి మరికొంతమంది కిరాయి రౌడీలతో కలిసి ప్రవేశించారు. తల్వార్, కత్తులు, కర్రలతో అక్కడ పనిచేస్తున్న వారిని బెదిరించారు. ఎక్స్‌కవేటర్ల సహాయంతో భూమి చుట్టూ వేసిన సుమారు 800 ఫెన్సింగ్ కడ్డీలను విరగ్గొట్టారు. దాడిలో గాయపడ్డ గాడిపర్తి రవీందర్ బాబు మునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ, మునిపల్లి, కొండాపూర్ సీఐలు దర్యాప్తు చేపట్టి ఈ వివాదంలో 17 మందిపై కేసు నమోదు చేసి పది మందిని అరెస్ట్ చేశారు.

## ఫిలింనగర్‌లో పిడుగు

- ఓ యువకుడికి తీవ్రగాయాలు

**బంజారాహిల్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** ఫిలింనగర్‌లో బుధవారం రాత్రి కురిసిన భారీవర్షంతో పిడుగు ధాటికి రాక్‌గార్డెన్‌లో ఆడుకుంటున్న వినాయకనగర్‌కు చెందిన ఓర్సు శ్రవణ్ (18) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని ఆయన తల్లి, జీహెచ్ఎంసీ స్వీపర్ ఓర్సు శైలజ విజ్ఞప్తి చేశారు.

## అమీర్‌పేటలో బీజేపీ నాయకుల సంబరాలు

**అమీర్‌పేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ ఎంపీగా రెండోసారి కిషన్ రెడ్డి విజయం సాధించడంతో అమీర్‌పేట సత్యంటాకీస్ చౌరస్తాలో బుధవారం బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నక్క శ్రీనివాస్, గౌలికార్ ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**వెంగళరావునగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టిపెట్టి రాణించాలని జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి శారద జాన్సి అన్నారు. మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 13 సంవత్సరాల లోపు బాల, బాలికలు స్థానిక ఇండోర్ స్టేడియంలో 45 రోజుల పాటు బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందారు. ముగింపు సందర్భంగా బుధవారం వారికి పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కోడె సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మన్నే కల్యాణ్ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రాజు, కోశాధికారి ఉప్పలయ్య, రాజన్‌బాబు, శ్రీనివాస్, సు .ధాకర్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు శేషు, ఆదినారాయణ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు పింఛన్ల పంపిణీ

**ఖైరతాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):** వాసవీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం దాదాపు 450 మంది పేదలకు వృద్ధాప్య పింఛన్లు, పేదలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వాసవీ సేవా కేంద్రం అధ్యక్షులు కొల్లూరు రమేష్, ప్రధాన కార్యదర్శి కాచం ప్రభాకర్, కోశాధికారి ఇల్లూరి నరేందర్, సేవా కేంద్రం జీవితకాల సలహాదారులు కొండ్లె మల్లికార్జున్, అలంపల్లి రవికుమార్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కూర జయరాములు గుప్త పాల్గొన్నారు.

## ఎత్తరి జంగయ్య సేవలు మరువలేం

**యూసఫ్‌గూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** నగరంలో వందలాది మందికి ఉపాధి కల్పించిన ఎత్తరి జంగయ్య పేరుతో బస్తీ ఏర్పాటు కావటం సంతోషంగా ఉందని రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్ అన్నారు. బుధవారం రెహ్మత్‌నగర్ డివిజన్‌లోని జంగయ్యబస్తీలో జంగయ్య 16వ వర్ధంతి నిర్వహించారు. కార్పొరేటర్ సీఎన్.రెడ్డి మాట్లాడుతూ జంగయ్య కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చేసిన సేవలను బోరబండ, రెహ్మత్‌నగర్ ప్రజలు ఎప్పటికీ మరచిపోరని అన్నారు. వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ మాట్లాడుతూ జంగయ్య సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు ఎత్తరి యాదయ్య, ఎత్తరి అంతయ్య, ఎత్తరి మోహన్ కుమార్, ఓర్సు కృష్ణయ్య, మక్కల పెంటేష్, శివరాత్రి అంజయ్య, ఓర్సు ఆడివయ్య, దేరంగుల బాల్‌రాజు, కోమరి శాంతకుమార్, డి.అనంతరావు, ఎం.రాజు, డి.రమేష్, నర్సింహ, డి.అశోక్, పి.రమేష్, ఎం.మధు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మక్తాల ఫౌండేషన్ సభ్యులు

## పర్యావరణాన్ని కాపాడాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

● మక్తాల జలంధర్ గౌడ్

**రాంగోపాల్‌పేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ సోమసుందరం వీధిలో ఫౌండేషన్ సభ్యులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పర్యావరణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని, కాలుష్య నివారణలో భాగంగా మోటారు వాహనాలకు బదులుగా సైకిళ్లను వాడాలని ఆయన ప్రజలను కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని కాపాడాలని విజ్ఞప్తిచేశారు. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు మొక్కలు నాటుదాం అనే నినాదంతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోరుతూ తన ద్విచక్రవాహనంపై మొక్కలను పెట్టుకొని ప్రజల్లో పర్యావరణం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కే.వేణు, సుబ్రహ్మణ్యం, మహేష్, ఎం.వేణు, భాస్కర్ పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం


మహ్మద్ సలీమ్

**బౌద్ధనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** చికెన్‌షాపులో పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడ షాబాద్‌గూడకు చెందిన మహ్మద్ సలీమ్(38) బౌద్ధనగర్ కౌసర్ మసీద్ వద్ద ఓ చికెన్‌షాపులో పనిచేస్తున్నాడు. మే 31వ తేదీన షాప్‌కు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో సలీమ్ కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. తన కుమారుడు కనిపించటం లేదని తండ్రి షేక్ అబ్దుల్ హమీద్ మంగళవారం రాత్రి వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లాలాపేట్‌లో పెట్రోల్ దొంగల అరెస్టు రెండు రోజుల జైలు శిక్ష


శ్రీకాంత్


విక్రమ్

**అడ్డగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** పార్కు చేసి ఉన్న బైకుల్లో పెట్రోల్ చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలకు సికింద్రాబాద్ కోర్టు న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. లాలాగూడ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ సాయినాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. లాలాగూడ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ (20), విక్రమ్ (20)లు గత కొద్ది రోజులుగా లాలాపేట్, ఇందిరానగర్ ఏరియాలో పార్కు చేసి ఉన్న బైకుల్లో పెట్రోల్ దొంగతనం చేస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న లాలాగూడ పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులను అరెస్టు చేయగా సికింద్రాబాద్ కోర్టు నిందితులకు రెండు రోజులు జైలు శిక్ష విధించిందని సాయినాథ్ తెలిపారు.


అరెస్టయిన స్మగ్లర్, స్వాధీనం చేసుకున్న గంజాయి

## రైల్లో గంజాయి రవాణా

● స్మగ్లర్ అరెస్ట్.. 22 కేజీల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** బ్యాగ్‌లలో గంజాయి నింపుకొని ఒడిశా నుంచి రైల్లో హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల కళ్లుగప్పి సరుకును సరఫరా చేయాలని చూసిన ఘరానా స్మగ్లర్‌ను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ. 5.55 లక్షల విలువైన 22 కేజీల గంజాయి బ్యాగ్‌లను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్స్ మాదకద్రవ్యాలను గుట్టుగా నగరానికి తెస్తున్నారు. ఇదే క్రమంలో ఒడిశా గజపతి జిల్లాకు చెందిన కురేష్ షైక్ అలియాస్ కురేష్‌కు నగరంలోని గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఉంది. అతడి ఆదేశాల మేరకు కురేష్ 22కేజీల గంజాయిని బ్యాగ్‌లలో నింపుకొని రైల్లో సికింద్రాబాద్ చేరుకున్నాడు. అక్కడి నుంచి బయటకు వచ్చి రిసీవర్ కోసం ఎదురుచూస్తున్నాడు. అతడికి సరుకు అందజేసి, డబ్బు తీసుకొని వెంటనే వెళ్లిపోవడానికి వేచి చూస్తున్నాడు. ఇంతలోనే విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్ న్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డానియేల్ బృందాలు రంగంలోకి దిగాయి. మార్కెట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి కురేష్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## న్యాయ పట్టభద్రులకు ఉచిత శిక్షణ

● రేపటి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన న్యాయ పట్టభద్రులకు మూడేళ్లపాటు ఉచిత నైపుణ్య శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందేవారికి నెలకు రూ.3 వేల స్టయిఫండ్, రూ.50వేల డిజిటల్ బుక్స్ ఫర్నిచర్, కంప్యూటర్, డ్రెస్ ఇస్తామని తెలిపారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకునేందుకు ఫీజు కూడా చెల్లిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 7 నుంచి జూలై 6వ తేదీలోపు tsepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

# అప్పుడలా.. ఇప్పుడిలా!

● ఐదు నెలల్లో మారిన కంటోన్మెంట్ రాజకీయ ముఖచిత్రం
● నెంబర్ 1గా ఉన్నవారు మూడో స్థానానికి
● నెంబర్ 3గా ఉన్నవారు మొదటి స్థానానికి

**బండ్లు ఓడలవడం, ఓడలు బండ్లు కావడమంటే ఇదేనేమో అనుకుంటున్నారు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఫలితం చూసిన ప్రతి ఒక్కరూ. ఐదు నెలల్లో వారు వీరు.... వీరు వారు అయ్యారంటూ చర్చించుకుంటున్నారు.**


శ్రీగణేష్ (కాంగ్రెస్)


వంశతిలక్ (బీజేపీ)


వెన్నెల (కాంగ్రెస్)


నివేదిత (బీఆర్ఎస్)

**సికింద్రాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** ఐదు నెలల క్రితం జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ 17వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బీజేపీ రెండో స్థానంలో, కాంగ్రెస్ మూడో స్థానంలో నిలిచాయి. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా బీఆర్ఎస్ అనుకూల పవనాలు వీయడం, కంటోన్మెంట్‌కు కేరాఫ్‌గా చెప్పుకునే సాయన్న మరణానంతర సానుభూతి పవనాలతో లాస్యనందితకు 59,057 ఓట్లు పోల్ కాగా, 17వేల ఓట్ల పైచిలుకు ఆధిక్యతతో విజయం సాధించారు. చివరి నిమిషంలో బీజేపీ టికెట్ దక్కించుకున్న శ్రీగణేష్‌కు కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి మాజీ ఉపాధ్యక్షులైన జంపనప్రతాప్, జె.రామకృష్ణ (ప్రస్తుతం నామినేటెడ్ సభ్యుడు కూడా), బాణుక నర్మద మల్లిఖార్జున్ తదితర కీలక నేతలు అండగా నిలవడంతో కంటోన్మెంట్ చరిత్రలో కమలం పార్టీకి రికార్డు స్థాయిలో 41,888 ఓట్లు పడ్డాయి. కాగా వేళ్ల మీద లెక్కపెట్టే ముఖ్య నేతలు మాత్రమే ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంతో శ్రమించినప్పటికీ వెన్నెలకు 20,825 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కంటోన్మెంట్‌లో తమకు తిరుగులేదని అటు బీఆర్ఎస్ పార్టీ, ఇటు సాయన్న కుటుంబం, ఆయన అనుచరగణం సంబరపడ్డారు. ఓడినప్పటికీ, ఓటు బ్యాంకు మెరుగుపడిందంటూ బీజేపీ తృప్తిపడింది. రాష్ట్ర విభజనానంతరం నేతలు, కేడర్ చెల్లాచెదురు కావడంతోనే తమకు ఈ దుస్థితి పట్టిందంటూ హస్తం పార్టీ సర్దిచెప్పుకుంది.

ఈ ఎన్నికలు నేర్పిన పాఠాలతో వచ్చే ఐదేళ్ల కాలంలో కష్టపడి, భవిష్యత్‌లో విజయం సాధించాలని బీజేపీ, కాంగ్రెస్‌లు భావించాయి. కాగా.... బీఆర్ఎస్ శాసనసభ్యురాలు లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక వచ్చింది. లోక్‌సభతోపాటు కంటోన్మెంట్‌కు ఉపఎన్నిక రావడంతో అన్ని పార్టీలు అప్రమత్తమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో చేజారిన సీటును ఈసారైనా చేజిక్కించుకోవాలని కాంగ్రెస్, సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, మోదీ చరిష్మాతో తొలిసారి కంటోన్మెంట్‌ను కైవసం చేసుకోవాలని బీజేపీలు భావించాయి. దీనికి తగ్గట్టుగానే అన్ని పార్టీలు సొంత అజెండాలు రూపొందించి, ప్రణాళికబద్ధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. పోటాపోటీగా తలపడ్డాయి. ప్రజలు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతారా?, సానుభూతికి ప్రాధాన్యతనిస్తారా?, మోదీ చరిష్మాకు ఫిదా అవుతారా? అంటూ విశ్లేషకులు సైతం ఆసక్తిగా ఎన్నికల ఫలితాల కోసం నిరీక్షించారు. ఎట్టకేలకు వెలువడిన ఫలితాలు చూసి ప్రతి ఒక్కరూ విస్తుపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ ఈ ఉపఎన్నికలో మూడో స్థానానికి పడిపోవడం, అప్పుడు డిపాజిట్ కూడా దక్కుతుందో లేదోనని ఆందోళనచెందిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకుని విజయం సాధించడం, పార్టీ అభ్యర్థి స్థానికంగా పెద్దగా సుపరిచితులు కానప్పటికీ బీజేపీ మళ్లీ రెండో స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం. రాజకీయాల్లో ఓడలు బండ్లు కావడం, బండ్లు ఓడలు కావడమంటే ఇదేనని ప్రజలు చర్చించుకుంటున్నారు.


కుమార్తెకు స్వీట్ తినిపిస్తున్న కిషన్‌రెడ్డి భార్య కావ్యరెడ్డి


వారాసిగూడలో సంబురాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పి.స్వరూపగౌడ్


**సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధించిన కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలుపుతున్న చిలకలగూడకు చెందిన ఎంసీఆర్ ప్రజాసేవ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు మేకల చంద్రశేఖర రావు**
- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

# బీజేపీ నాయకుల సంబురాలు

**బౌద్ధనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి మూడోసారి ఆధిక్యం సాధించడంతోపాటు సికింద్రాబాద్ ఎంపీగా గంగాపురం కిషన్‌రెడ్డి రెండోసారి గెలవటంతో బుధవారం వారాసిగూడ చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని నాయకులు, కార్యకర్తలకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, సతీష్‌రాజ్, వేణుగోపాల్, ప్రసాద్, లక్ష్మణ్, జగత్‌సేన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి రెండోసారి కిషన్‌రెడ్డి గెలుపొందటంతో బీజేపీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు గంగాపురం కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, కుమార్తె, కుమారుడికి స్వీట్లు తినిపించారు.

**చిలకలగూడలో ..**

సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గంగాపురం కిషన్‌రెడ్డి రెండోసారి గెలవటంతో బుధవారం సాయంత్రం చిలకలగూడలో బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు.

**మెట్టుగూడలో..**

మెట్టుగూడ, స్కైలాబ్ హోటల్ వద్ద బుధవారం డివిజన్, కార్యదర్శి సి.రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ విజయం పట్ల సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించి ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం, రాష్ట్రంలో 8మంది సభ్యులు ఎన్నిక కావడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీను, రవి, సరోజ, భానుమతి, రాజేశ్వరి, అంజన పాల్గొన్నారు.

**కంటోన్మెంట్‌లో..**

**బోయినపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** కంటోన్మెంట్ నియోజకవర్గం బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ విజయకేతనం ఎగురవేశారు. ఈ నేపథ్యంలో బుధవారం కంటోన్మెంట్ ప్రాంతంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకటో వార్డులో బీజేపీ నాయకుడు రాయల్‌కుమార్, బీజేపీ శంకర్, ప్రేమ్‌కుమార్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. 2వ వార్డులో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. 3వ వార్డులో బీజేపీ స్పోక్‌పర్సన్ బి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకోగా, ఆరవ వార్డులో బీజేపీ నాయకుడు బానుక నర్మద మల్లికార్జున్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు అంబరాన్నంటాయి.


మెట్టుగూడ స్కైలాబ్ వద్ద రాజేష్ తదితరులు


కార్యకర్తలకు, నాయకులకు స్వీట్లు తినిపిస్తున్న బీజేపీ ఓబీసీ విభాగం కోశాధికారి ఆకారం రమేష్ తదితరులు


భావనకాలనీలో కార్యకర్తలతో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకుడు బానుక నర్మద మల్లికార్జున్

## ప్రతి ఒక్కరూ విధిగా పర్యావరణాన్ని పరిరక్షించాలి

**దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనుంజయులు**

**హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణపరిక్షణకు విధిగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ పనులను ఎవరికి వారు తమ ఇళ్ల వద్దనుంచే ఆరంభించాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధనుంజయులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఆరోగ్య రక్షణకు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రధానమన్నారు. రైల్వే కాలనీలు, కార్యాలయాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రం పాటించాలన్నారు. వర్షపు నీటి సంరక్షణ, నీటి వనరుల పునరుజ్జీవనం, ఇంధన పొదుపు, అడవుల పెంపకం, పర్యావరణ హిత బయోటాయిలెట్లు ఏర్పాట్లతో పర్యావరణ పరిరక్షణకు రైల్వే నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐ.జీ.బీ.సి) వైస్ ప్రెసిడెంట్, సి.శేఖర్ రెడ్డి సౌరవ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా 73లక్షల మొక్కలు నాటడంతోపాటు పూర్తిస్థాయిలో 100% రైల్వేలైన్ విద్యుదీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే జోన్ వ్యాప్తంగా 76 ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ మిషన్లను ఏర్పాటు చేయడంతో పాటు హరితభవనాలను అభివృద్ధి చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## బాపట్ల ఎంపీగా మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్

● గతంలో కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా ఖరారు


కృష్ణప్రసాద్

**సికింద్రాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా టీడీపీ తరపున పోటీ చేసిన మాజీ ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్ ఘన విజయం సాధించడం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అక్కడ ఎంపీగా గెలిచిన అభ్యర్థి గురించి ఇక్కడ చర్చించుకోవడమేంటనుకుంటున్నారా...? అసలు సంగతి ఏమిటంటే.... తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి కొద్ది నెలల క్రితం జరిగిన ఎన్నికల ముందు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభ్యర్థిగా టి.కృష్ణప్రసాద్ పేరును బీజేపీ నాయకత్వం దాదాపు ఖరారు చేసింది. కృష్ణప్రసాద్ అభ్యర్థిత్వంపై మీడియాలో కూడా వచ్చింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విడుదల చేసిన కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల అభ్యర్థుల జాబితాలో కృష్ణప్రసాద్ పేరు చోటుచేసుకుంది. అయితే కొద్ది గంటల వ్యవధిలోనే మార్పు జరిగింది. కృష్ణప్రసాద్ స్థానంలో ఎన్.శ్రీగణేష్ (తాజా ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి గెలిచిన అభ్యర్థి) పేరు ప్రకటించారు. తనకు శాసనసభకు పోటీ చేసే ఉద్దేశ్యం లేదని, తనకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపీగా పోటీ చేయాలనుందని కృష్ణప్రసాద్ స్వయంగా పేర్కొన్నారని, బీజేపీ పెద్దలు తన అభ్యర్థిత్వంపై మొగ్గు చూపారని అప్పట్లో కంటోన్మెంట్ బీజేపీ ముఖ్య నాయకులు తెలిపారు. తాజాగా దేశ వ్యాప్తంగా లోక్‌సభకు ఎన్నికలు జరగడం, ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ (మహాకూటమి) తరపున కృష్ణప్రసాద్ పోటీ చేయడం, భారీ మెజారిటీతో విజయం సాధించడం ప్రస్తుతం కంటోన్మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ సంబురాలు


కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద జంపన ప్రతాప్‌ను అభినందిస్తున్న అభిమానులు

**బోయినపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి):** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని న్యూబోయినపల్లి కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్ వద్ద బుధవారం కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేష్ విజయకేతనం ఎగురవేశారు. బుధవారంతో ఎన్నికల కోడ్ ముగియడంతో బోయినపల్లి ప్లే గ్రౌండ్ సమీపంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ఆధ్వర్యంలో విజయోత్సవాలు జరిగాయి. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. జై కాంగ్రెస్, జై రేవంతన్న, జై జంపన్న నినాదాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా జంపనప్రతాప్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్‌ను గెలిపించిన కంటోన్మెంట్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపైన పెట్టుకున్న నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామని అన్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ నేతలు అభివృద్ధిని కాగితాల్లో చూపెట్టారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ సారథ్యంలో కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. రామన్నకుంట చెరువు అభివృద్ధి, రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిరాజ్, షకీబ్, అజీమ్, జ్ఞాన్‌ప్రకాష్, అశోక్, రాజు, అజిత్, రమేష్, మాల్యాద్రి, ప్రభాకర్, రామారావు, వరప్రసాద్, ముకేష్ యాదవ్, దుర్గయ్య, అంజాద్, అరుణ్ యాదవ్, అశోక్ ముదిరాజ్, కుమార్ పాల్గొన్నారు.


ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అధిక సీట్లు సాధించినందుకు ఏఐసీసీ సభ్యులు కరారి గౌరీశంకర్, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మహేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. - రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

## స్టాక్‌మార్కెట్ ఐపీవో పేరుతో మోసం

● లోన్ ఇప్పించి.. రూ.34.90 లక్షలు కొట్టేశారు
● వాట్సాప్‌లో మెసేజ్.. '657 ఐసెకన్' పేరుతో గ్రూప్
● ప్రత్యేక యాప్‌తో బురిడీ.. నిలువునా ముంచిన కేటుగాళ్లు

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** స్టాక్ మార్కెట్‌లో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లో పెట్టుబడి పేరుతో.. సైబర్ కేటుగాళ్లు రుణం ఇప్పించి మరీ ఓ బాధితుడి నుంచి రూ.34.90లక్షలు కొట్టేశారు. నగరానికి చెందిన సదరు బాధితుడి ఫిర్యాదుతో సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు వాట్సాప్‌లో స్టాక్‌మార్కెట్ పేరుతో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. '657 ఐసెకన్' అనే వాట్సాప్ గ్రూపులో అతడు యాడ్ అయ్యాడు. ఆ గ్రూప్‌లో 140 మంది సభ్యులున్నారు. వారంతా రోజువారీ వ్యూహాలు.. లాభాల గురించి చర్చించుకుంటున్నారు. గ్రూప్ అడ్మిన్ నుంచి 'ఇంకా యాప్ డౌన్‌లోడ్ చేసుకోనివాళ్లు కింది లింక్ ద్వారా వివరాలను పంపొచ్చు' అనే సందేశాన్ని పోస్ట్ చేశాడు. దానికి బాధితుడు స్పందించడంతో.. వ్యక్తిగత వివరాలను సేకరించి, అతడితో ఫేక్ బ్రోకరేజ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అందులో ట్రేడింగ్ చేసే సదుపాయం కల్పించారు. శివం కెమికల్స్ అనే కంపెనీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్స్ (ఐపీవో)లో పెట్టుబడులు పెట్టాలంటూ యాప్ ప్రతినిధుల పేరుతో బాధితుడికి ఫోన్లు వచ్చాయి. బాధితుడు దానికి ఒప్పుకోకపోవడంతో.. సెబీ నుంచి భారీ పెనాల్టీ పడుతుందని హెచ్చరించారు. "నా దగ్గర డబ్బుల్లేవు" అని చెబితే.. బజాజ్ క్యాపిటల్ నుంచి భారీగా లోన్ ఇప్పించి, ఇన్వెస్ట్ చేయించారు. లాభాలు కూడా భారీగా వచ్చినట్లు యాప్‌లో కనిపించడంతో.. బాధితుడు విత్‌డ్రా చేసుకునేందుకు యత్నించగా.. ఆ ఆప్షన్ కనిపించలేదు. యాప్ ప్రతినిధులకు కాల్ చేసినా.. స్పందనలేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

## ఔరంగాబాద్‌లో ఓటమితో .. లోక్‌సభలో మజ్లి‌స్‌కు మళ్లీ ఒకే ఒక్కడు..!

**హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** గత లోకసభలో ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (మజ్లిస్) పార్టీకి ఇద్దరు సభ్యులుండగా ఈసారి ఒకే ఒక్క సభ్యుడితో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మజ్లిస్ మొట్టమొదటిసారి 1984 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టింది. అప్పటి నుంచి వరుసగా ఆరుసార్లు సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ, అనంతరం ఆయన కుమారుడు అసదుద్దీన్ ఒవైసీ 2004 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు లోక్‌సభ సభ్యుడిగా వరుసగా ఎన్నికయ్యారు. ఈసారి అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజారిటీతో లోకసభకు ఎన్నికయ్యారు. కాగా, 2019లో మహారాష్ట్రలో జరిగిన రాజకీయ పరిణామాల్లో ఔరంగాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఇంతియాజ్ జలీల్ విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టారు. దీంతో గత లోక్‌సభలో మజ్లిస్‌కు ఇద్దరు సభ్యుల బలం ఉండేది. ఈసారి ఔరంగాబాద్ నుంచి పోటీ చేసిన ఇంతియాజ్‌జలీల్ శివసేన అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే, బీహార్‌లోని కిషన్‌గంజ్ సీటును కైవసం చేసుకునేందుకు మజ్లిస్ తీవ్రంగా ప్రయత్నించింది. పార్టీ ఆ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ సైతం రెండు దఫాలుగా బీహార్‌లో పర్యటించి కిషన్‌గంజ్‌లో అక్తరుల్ ఇమాన్‌ను గెలిపించేందుకు విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. మూడోస్థానానికి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో గతంలోలాగే మళ్లీ లోక్‌సభలో మజ్లిస్ పార్టీ ప్రతినిధిగా అసదుద్దీన్ ఓవైసీ ఒక్కరే ప్రాతినిధ్యం వహించనున్నారు.

## సౌరశక్తిని ప్రోత్సహిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

● అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్



రోజా మహిళా పొదుపు సంఘం ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న వాణీప్రసాద్

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సౌరశక్తి(సోలార్ పవర్)ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాణీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా వృక్ష సంపదను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, భూ వినియోగ మార్పులు, నీటి వనరుల పర్యవేక్షణకు రిమోట్ సెన్సింగ్‌తో పాటు జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సాంకేతికతను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. సభ్య కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన వ్యర్థాలను సరైన రీతిలో నిర్వహించి కాలుష్య నివారణకు సహకరించాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. చెట్ల పెంపకంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా వివిధ పద్ధతుల ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న పరిశ్రమలు, ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, పొదుపు సంఘాల ప్రతినిధులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జయదేవ్ పాల్గొన్నారు.

## నగరాలు - పర్యావరణంపై అధ్యయనం..!

● ప్లానింగ్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):** ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ రీజనల్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్లానింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో 2024కు గాను నిర్వహించిన పోటీల్లో విజేతలను ప్రకటించారు. డీటీసీపీ డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డి చైర్మన్, కార్యదర్శి మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో 'నగరాలు - పర్యావరణం' అనే థీమ్‌తో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. దేశంలోని ఏదైనా నగరంలో(నీళ్లు, వాతావరణం, ఎనర్జీ, వెజిటేషన్ తదితర సబ్ థీమ్‌లపై) అధ్యయనం చేసి శాస్త్రీయ విధానంలో పేపర్, పోస్టర్ సమర్పించారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. త్రిస్సూరు నగరంపై కోల్‌కతా ఎన్ఐటీకి చెందిన విద్యార్థులు అర్షియా, అనుశ్రీ, ఆదర్శ్ అధ్యయనం చేసి 'కర్బన ఉద్గారాలు - ప్రభావాల అంచనా'పై సమర్పించిన పేపర్‌కు ప్రథమ, 'బెంగళూరులో నీటి సంక్షోభం-వ్యూహాత్మక విధానాల విశ్లేషణ'పై హైదరాబాద్ జేఎన్ఏఎఫ్‌యూ విద్యార్థులు గాజుల అంజలి, మేగరాజ్ ధనుంజయ్, అభినయ్‌ఇంద్రాణి పేపర్‌కు ద్వితీయ, 'నీటి లభ్యత-సామాజిక, పర్యావరణ ప్రభావాలు' అంశంపై చెన్నైలో అవలంబిస్తోన్న విధానాలపైన ఎస్‌పీఏ ఢిల్లీకి చెందిన విద్యార్థులు కలంగుట్కర చిన్మయి, దేవేష్ పట్వారిబ్, ధనుష్ కుమార్ సమర్పించిన పేపర్‌కు తృతీయ బహుమతి లభించింది. సెమినార్‌లో వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్ డైరెక్టర్ అనంత్ మరిగంటి, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ పెంటకొటోలు దేవేందర్‌రెడ్డితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు.